RNI NO.APTEL/2006/18110

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

శనివారం 12 - 09 - 2026

## ముచ్చటగా మూడు రోజులు అసెంబ్లీకి కేసీఆర్.

24 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం. టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఇందిర శోభన్. బీఆర్ఎస్ పార్టీ కి రాష్ట్రలో పుట్టగతులు ఉండవు.

3లో

# ఎస్ఐఆర్ నోటీసుల జారీ,

## విచారణ ప్రక్రియను వేగవంతం చేయాలి.



నిజామాబాద్ సెప్టెంబర్ 11 ( ప్రజాగళం ప్రతినిధి) ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో భాగంగా అనామలీస్, నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు అందించి, పక్కాగా మార్గదర్శకాలను పాటిస్తూ పారదర్శకంగా విచారణ నిర్వహించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసుల జారీ, వాటి పంపిణీ, విచారణ ప్రక్రియపై ఒక్కో మండలం వారీగా సమీక్షించారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎన్నికల సంఘం గడువు పొడిగించిన నేపథ్యంలో ఈ వెసులుబాటును వినియోగించుకుని నిర్ణీత గడువు లోపు పూర్తి చేయాలని అన్నారు. నోటీసుల విచారణ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని, ప్రతి కేసుకు సంబంధించిన ధ్రువపత్రాలు క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ ముందుకెళ్లాలని అన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించాలని, పోలింగ్ స్టేషన్ల వారీగా ప్రతిరోజూ బీఎల్ఓలు, సూపర్వైజర్ల పనితీరును పర్యవేక్షించాలని తహసీల్దార్లకు సూచించారు. పెండింగ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి మిగిలిన నోటీసుల పంపిణీని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వేరే ప్రాంతానికి శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు ఉంటే, అలాంటి వారు ఫారం - 8 సమర్పించేలా చూడాలన్నారు. చివరి నిమిషంలో హడావుడి పడకుండా గడువు కంటే ముందే ఈ ప్రక్రియను పూర్తి చేసేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. కాగా, 22-ఏ నిషేధిత భూములకు సంబంధించి ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులు, అర్జీలపై సత్వరమే స్పందించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. దరఖాస్తుదారులను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకూడదని అన్నారు. భూభారతి చట్టం మార్గదర్శకాలను పాటిస్తూ, రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ అర్జీలను వెంటదివెంట పరిష్కరించాలని హితవు పలికారు. అర్జీల పరిష్కారంలో జాప్యం వల్ల దరఖాస్తుదారులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉత్పన్నం కాకూడదని అన్నారు. ఈ విషయంలో అలసత్వ వైఖరిని ప్రదర్శిస్తే ఉపేక్షించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీఆర్ఓ గీత, ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, విజయ కుమారి, కలెక్టరేట్ ఏ.ఓ బాలరాజు, అన్ని మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## భక్తి భావంతో ఉత్సవాలు నిర్వహించాలి..

- ధన్ పాల్ లక్ష్మీ బాయి విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మండపాలకు సహకారం...
- బారులు తీరిన నిర్వాహకులు...

ఇందూరు: వినాయక మండపాల నిర్వహకులు యువత ఉత్సవాలను భక్తి భావంతో నిర్వహించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ తెలిపారు. శ్రీ ధన్ పాల్ లక్ష్మీ బాయి విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని మార్వాడి గల్లి లో గల కార్యాలయంలో వినాయక ఉత్సవ నిర్వాహకులకు చెందాలను రాశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. ఇందూరు యువత భక్తి మార్గంలో నడవాలని సూచించారు. వినాయక ఉత్సవాలను హిందూ సాంప్రదాయం ప్రకారం ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా శాంతియుతం గా నిర్వహించాలని తెలిపారు. ప్రతి సంవత్సరం తమ ట్రస్టు ద్వారా సహకారం అందిస్తామని గత సంవత్సరం 725 మండపాలకు అందించినట్లు పేర్కొన్నారు. భగవంతుడి ఆశీర్వాదంతో ఈ ఏడాది కూడా వచ్చిన వారందరికీ తన వంతు సహకారం ఉంటుందన్నారు. వినాయకుడు కేవలం ఒక పండుగకు సంబంధించిన దేవుడు కాదని సంస్కృతి సనాతన ధర్మం ఐక్యతకు ప్రతీక అని చెప్పారు. వినాయకుడిని పూజిస్తే విఘ్నాలు తొలగి శుభాలు జరుగుతాయన్నారు. ఇంటింటా గణపతి పూజా చాలాకాలంగా ఉన్నప్పటికీ సామూహిక ఉత్సవాలకు బాలగంగాధర్ తిలక్ ప్రోత్సహించాడని గుర్తు చేశారు.

# అన్నదాతకు అండగా నిలిస్తున్న రైస్ మిల్లర్ల పై కక్ష సాధింపు తగదు.

**ధర్నా ధర్నా కార్యక్రమంలో రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి.**




నిజామాబాద్ సిటీ సెప్టెంబర్ 11 (ప్రజాగళం) అన్నదాతకు అండగా నిలుస్తున్న రైస్ మిల్లర్ ల పై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సమంజసం కాదని మోహన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రైస్ మిల్లర్లపై దాడులకు నిరసనగా, ప్రభుత్వ చర్యలను ఖండిస్తూ నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ లో రైస్ మిల్లర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేపట్టారు.

ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రైస్ మిల్లర్ల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి ప్రసంగించారు. కష్ట, నష్టాలకు ఓర్చుకొని ఇటు రైతంగానికి, ప్రభుత్వానికి అండగా నిలుస్తున్న రైస్ మిల్లర్లపై రాష్ట్రవ్యాప్తంగా వరుస దాడులకు పాల్పడటం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన 9 కోట్ల 70 లక్షల టన్నుల ధాన్యంలో ఇప్పటికే 9 కోట్ల 60 లక్షల టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వానికి అప్పగించడం జరిగిందన్నారు. కేవలం 10 లక్షల టన్నుల ధాన్యం కోసం వేధించడం సరైన పద్ధతి కాదన్నారు. ఇకనైనా ప్రభుత్వం మనసు మార్చుకొని రైస్ మిల్లర్లకు అండగా నిలవాలని ఆయన కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్చల ద్వారా మా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాను. ఈ ధర్నా కార్యక్రమంలో మోటూరి దయానంద్ గుప్తా, జిల్లాలోని పలువురు రైస్ మిల్లర్ లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికే బ్లడ్ ప్రెజర్ అపరాటస్‌ల అందజేత.



నిజామాబాద్, సెప్టెంబర్ 11( ప్రజా గళం ప్రతినిధి ) ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికీ 20 బ్లడ్ ప్రెజర్ అపరాటస్‌లను మనోరమా హాస్పిటల్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డా. శిరిపల్లి శ్రీనివాస్ మానవతా దృక్పథంతో విరాళంగా అందించి సేవా కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. ఎల్. రాములు, డా. శిరిపల్లి శ్రీనివాస్ కి కృతజ్ఞతలు తెలియజేసి, శాలువాతో సత్కరించారు. ప్రభుత్వ ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాలను విరాళంగా అందించడం ద్వారా రోగుల వైద్య సేవలకు తోడ్పాటు అందించిన డా. శిరిపల్లి శ్రీనివాస్ సేవలను ఈ సందర్భంగా ఆసుపత్రి యాజమాన్యం అభినందించింది.

## ఇందూర్ హై స్కూల్లో ఉత్తమ ఉపాధ్యాయులకు ట్రస్మ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం..



బోధన్ ప్రతినిధి,సెప్టెంబర్ 11: (ప్రజా గళం) సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించు కొని,బోధన్ ప్రైవేటు పాఠశాలలులలాగే కళాశాలల యాజమాన్యాల సంఘం వారి ఆధ్వర్యంలోగురువారం సాయంత్రం ఆచార్యదేవోభవ 2026 కార్యక్రమాన్ని స్థానిక ఇందూర్ హైస్కూల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి పార్శి అశోక్ విశిష్ట అతిథులుగా,బోధన్ మండల విద్యాశాఖ అధికారి ఏ.నాగయ్య,సాలూర మండల విద్యాశాఖ అధికారిణి రాజీ మంజూషలు హాజరయ్యారు. బోధన్ డివిజన్లోని ట్రస్మా ఆధ్వర్యంలో ఉన్నటువంటి ప్రతి పాఠశాలలోని ఉత్తమ ఉపాధ్యా యులను సన్మానించారు.ట్రస్మ జిల్లా అధ్యక్షులు కొడాలి కిషోర్,పట్టణ అధ్యక్షులుహరిక్రిష్ణ పాల్గొన్నారు.

## శాసనసభ స్పీకర్ తల్లిపట్ల బిఆర్ఎస్ నేతల అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ధర్నా. ఈ చర్యలకు కారణమైన కేసిఆర్ దిష్టి బొమ్మ దహనం.



బోధన్ ప్రతినిధి,సెప్టెంబర్ 11: (ప్రజా గళం) బోధన్ నియోజకవర్గం పరిధిలోని సాలూర మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందర్న రవి ఆధ్వర్యంలో శుక్రవారం బిఆర్ఎస్ పార్టీ నేతలు శాసనసభ స్పీకర్ తల్లి పట్ల అనుచిత వ్యాఖ్యలకు, దళితుల పట్ల వారి అహంకార ధోరణికి అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్ల కేటీఆర్,హరీష్ రావు బిఆర్ఎస్ నేతల తీరుకు నిరసనగా ధర్నా నిర్వహించా రు.ఇలాంటి చర్యలకుకారణమైన బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కేసీఆర్ దిష్టి బొమ్మ దహనం చేశారు.ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున మండల కాంగ్రెస్ పార్టీ నేతలు,పార్టీ ఎస్సి సెల్ నాయకులు,సర్పంచ్ లు,వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అలీసాగర్ అభివృద్ధికి చర్యలు.

### జిల్లా అదనపు కలెక్టర్ భుజంగరావు వెల్లడి

అలీసాగర్ ఉద్యాన వనాన్ని ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్.



ఎడపల్లి,సెప్టెంబర్ 11: (ప్రజా గళం) నిజామాబాద్ జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రదేశమైన ఎడపల్లి మండలం రాణాకలాన్ గ్రామ శివారులో గల అలీసాగర్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ భుజంగరావు తెలిపారు.శుక్రవారం అలీసాగర్ ను అడిషనల్ కలెక్టర్ ఆకస్మికంగా సందర్శిం చారు.అక్కడ పార్కు,ఉద్యానవనం,బోటింగ్ పాయింట్,హరిత హోటల్ ను పరిశీలించారు.తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి భారీగా పర్యాటకులు అలీసాగర్ ఉద్యానవనం(గార్డెన్)ను సందర్శిస్తున్నార ని అన్నారు.అలీసాగర్ లో పర్యాటకులు సందర్శించి ఆహ్లాదకరమైన వాతావరణం అస్వాదిస్తున్నారని, పచ్చని వృక్షాలు పర్యాటకులకు ఉత్సాహాన్ని ఇస్తున్నా యని అన్నారు.ఈ సందర్భంగా అలీసాగర్ లో పర్యాటక అభివృద్ధిలో భాగంగా కాంపౌండ్ వాల్,తీగల వంతె న,రాత్రి విడిది కోసం ప్రతిపాదనలు పంపనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ భుజంగరావు తెలిపారు..

## కుర్నాపల్లిలో రేషన్ వినియోగదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పులి శ్రీనివాస్ రావు పంపిణీ.

### ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోంది.

### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్ రావు వెల్లడి.



ఎడపల్లి,సెప్టెంబర్ 11: (ప్రజా గళం) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభిం చిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఎడపల్లి మండలంలో ప్రారంభమయ్యాయి. దాంట్లో భాగంగా ప్రభుత్వ ప్రధాన సలహాదారు,బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎడపల్లి మండలం కుర్నాపల్లి గ్రామంలో శు క్రవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస రావు చేతుల మీదు గా,స్థానిక సర్పంచ్ పరిగె సాయిలు రేషన్ వినియోగదా రులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భం గా పార్టీ అధ్యక్షుడు పులి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. నకిలీల ఏరివేత పారదర్శకతే లక్ష్యంగా వాటర్ ప్రూఫ్, క్యూఆర్ కోడ్,హోలో గ్రామ్ వంటి అత్యాధునిక భద్రత ఫీచర్లతో ఈ కొత్త కార్డులను ఉచితంగా అందిస్తోందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం పేదల ఆహార భద్రత కోసం అత్యంత ప్రతిష్టా త్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్ర మం స్వాతంత్ర్య దినోత్సవం (ఆగస్టు 15) పర్వదినం సందర్భం గా రాష్ట్రవ్యాప్తంగా అట్టహాసంగా ప్రారంభ మైంది అని అయన తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ బృహత్తర కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారని అన్నారు. కుర్నాపల్లి గ్రామానికి సుమారు 900 స్మార్ట్ రేషన్ కార్డులు రావడం జరిగింది అని తెలిపారు.పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోంది అని అన్నారు.ఇచ్చిన హామీలో ప్రతి సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది అని,నేడు రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు పులి శ్రీనివాస్ రావు తెలిపారు.ఈ కార్యక్ర మంలో స్థానిక సర్పంచ్ పరిగె సాయిలు,ఉపసర్పంచ్ రామ స్వామి,పంచాయతీ కార్యదర్శి రజిత,ఉ మామ హేశ్వర స్వామి ఆలయ చైర్మన్ కొప్పుల చంద్రశేఖర్ రెడ్డి,సొసైటీ వైస్ చైర్మన్ గాంధారి అనిల్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు గాంధారి హను మంత్ రెడ్డి,ఎల్కి రవి,మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మహ్మద్ ఏజాన్,కోంద్ర సంజయ్, కాట్నపల్లి రాజా గౌడ్,గాండ్ల గంగాధర్,నీలం నర్సింలు,ఐటి సాయంరెడ్డి, ఇప్ప సాయిలు, కోంద్ర పాండు తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే దేశ ప్రగతి

### ఫిజిక్స్ వాలా విద్యాపీఠ్ మిరాయి ను ప్రారంభించిన ఏసిపి వెంకటేశ్వర రెడ్డి.

### ఆవుతులను అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు.

ఆర్మూర్ సెప్టెంబర్ 11(ప్రజాగళం): విద్యార్థు లు క్రమశిక్షణతో విద్యను అభ్యసిం చినప్పుడే దేశ ప్రగతి సాధ్యపడుతుంది అని , విద్యార్థు లు లక్ష్యం వైపు అడుగులు వేయాలని ఈ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్, మున్సిపల్ చైర్ పర్సన్ గోనెలహరి రఘు స్పష్టం చేశారు.శుక్రవారం పట్టణంలోని క్షత్రియ కళ్యాణ మండపంలో కళ్యాణ మండపంలో ఫిజిక్సవాలా విద్యాపీఠ్ ఫ్రెషర్స్ డే సెలబ్రేషన్స్ మీర్రె సి వి రమణ్ కాలేజ్. ముఖ్యఅతిథిగా హాజరైన ఈరవత్రి రాజశేఖర్ , మున్సిపల్ చైర్ పర్సన్ గోనె లహరి రఘులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు ,విద్యార్థులు క్రమశిక్షణ విద్యను అభ్యసించినప్పుడే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారన్నారు.











ఒక సానియా మీర్జా, అబ్దుల్ కలాం, వంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కష్టపడి చదివినప్పుడే అనుకున్న లక్ష్యాలను చేరుకుంటామన్నారు. కలెక్టర్,డాక్టర్, ఇంజనీర్, చార్టెడ్ అకౌంట్ వంటి ఉద్యోగాలు పొందవచ్చు అన్నారు. విద్యార్థులు లక్ష్యం వైపు అడుగులు వేయాలన్నారు. లక్ష్యాన్ని సాధించినప్పుడే గోల్ను సాధిస్తామన్నారు. కమిట్మెంట్ తోనే వనులు చేసినప్పుడే ముందడుగు చేస్తామన్నారు. ఆర్మూర్ పట్టణంలో ఫిజిక్స్ వాలా విద్యార్థి లాంచ్ కావడం ఆర్మూర్ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వరంల మారిందన్నారు.ఆవేశాలకు, ఆకర్షణకు లోను కాకుండా విద్యపై దృష్టి పెట్టాలన్నారు. తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫేషర్స్ డే సందర్భంగా చేసిన నృత్యాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏసిపి వెంకటేశ్వర్ రెడ్డి, ఫిజిక్స్ వాలా సీనియర్ మేనేజర్ అజయ్ కౌల్, ఫిజిక్స్ వాళ్ల అసిస్టెంట్ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి. అసిస్టెంట్ బిజినెస్ హెడ్ ఆఫీసర్ రాజేష్, ఫిజిక్స్ వాలా ఆర్మూర్ సీఈవో గిరి, సివిఆర్ కాలేజ్ డైరెక్టర్ ప్రవీణ్, ఫిజిక్స్ వాళ్ల బిజినెస్ హెడ్ ఆఫీసర్ నాందేడ్ సచిన్ వాసు మారే, కాంగ్రెస్ నాయకులు విజయ అగర్వాల్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



# డబుల్ బెడ్ రూమ్ ల పరిశీలన,సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా

ఆర్మూర్ సెప్టెంబర్ 11(ప్రజగళం) మున్సిపల్ పరిధిలోని కోటామూర్ రెవిన్యూ పరిధి లో నిర్మించబడిన డబుల్ బెడ్ రూమ్ లను సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా శుక్రవారం పరిశీలించారు. నిర్మించబడిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలకు డబల్ బెడ్ రూమ్ అందించినప్పుడు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పించడం అధికారులు బాధ్యత చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ సత్యనారాయణ. మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రావు. రెవిన్యూ సిబ్బంది. మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు

# నేడు బోధన్ పట్టణ,పరిధిలో సబ్ స్టేషన్ మెయింటేనేన్స్‌లో భాగంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం.

-విద్యుత్ వినియోగదారులు సహకరించాలి.

-బోధన్ టౌన్-1 ఎఈ.నాయిని కృష్ణ వెల్లడి.



బోధన్ ప్రతినిధి,సెప్టెంబర్ 11: (ప్రజా గళం) బోధన్ పట్టణంలో ఈ నెల 12వ తేది రెండవ శనివారం సబ్ స్టేషన్ మెయింటేనేన్స్ లో భాగంగా విద్యుత్ సరఫ రాలో అంతరాయము ఉంటుందని బోధన్ టౌన్-1 విద్యుత్ శాఖ ఎఈ.నాయిని కృష్ణ తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఎఈ ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. శనివా రం బోధన్ సబ్ స్టేషన్ పరిధిలో అలాగే, పట్టణంలోని అన్ని కాలనీలకు మధ్యాహ్నం 2 గంటల నుండి 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని,ఈ సందర్భంగా విద్యుత్ వినియోగదా రులు విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని టౌన్-1 విద్యుత్ శాఖ ఎఈ నాయిని కృష్ణ కోరారు.

# అలీసాగర్ అభివృద్ధి కి చర్యలు. అలీ సాగర్ ను సందర్శించిన అదనపు కలెక్టర్ భుజంగరావు.



నిజామాబాద్ సిటీ సెప్టెంబర్ 11 ( ప్రజా గళం ) నిజామాబాద్ జిల్లాలో గల ప్రముఖ పర్యాటక ప్రదేశము అలీసాగర్ అభివృద్ధి కి చర్యలు తీసుకొనున్నట్లు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) భుజంగరావు తెలిపారు .క్షేత్ర పర్యటనలో భాగంగా అలీ సాగర్ ను శు క్రవారం ఆకస్మికంగా సందర్శించి పార్కు, ఉద్యానవనశీ బోటింగ్ పాయింట్, హరిత హోటల్ ను పరిశీలించారు..హరిత హోటల్ లో పర్యాటకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.అలాగే బోటింగ్ సిబ్బందికి పర్యాటకుల బోటింగ్ సందర్భంగా తీసుకోవలసిన జాగ్రత్తలను గూర్చి వారికి వివరించారు.రాబోవు రోజుల్లో అలీసాగర్ ను అభివృద్ధి పరచడానికి కాంపౌండ్ వాల్, తీగల వంతెన, రాత్రి విడిది కోసం ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బోట్ లో తిరిగారు.ఆయన వెంట ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ సందీప్,జిల్లా పర్యాటక అభివృద్ధి అధికారి పవన్ కుమార్ లు పాల్గొన్నారు.

# తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీర వనితచాకలి ఐలమ్మ.

## సీపీఐ(ఎం-ఎల్ )ఎంఎల్ మాస్ లైన్ బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి బి.మల్లేష్.



బోధన్ ప్రతినిధి,సెప్టెంబర్ 11: (ప్రజా గళం) నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద రజక సంఘం ఆధ్వర్యంలో చాకలిఐలమ్మ 41 వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సి.పి.ఐ (ఎం-ఎల్)మాస్ లైన్ (ప్రజా పంథా) పార్టీ బోధన్ డివిజన్ సహాయ కార్య దర్శి బి. మల్లేష్ మాట్లాడుతూ నాటే నైజాం పాలనలో భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన వీర వనిత ఐలమ్మ అని కొనియాడారు.ఆమె పొలంలోని పంట లను దౌర్జన్యంగా నాటి భూస్వామి విసునూరు రామ చంద్రారెడ్డి గూండాలు వచ్చి తీసుకుపోతూ ఉ ంటే తెగించి పోరాడిన ధైర్యశాలి ఐలమ్మ అని ఆ విధంగా నాడు తెలంగాణ సాయుధ పోరా టంలో తొలి పోరాటా నికి నాంది పలికినది వీరనారి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. అయితే తెలంగాణ మలిదశ ఉద్యమం లో చాకలి ఐలమ్మ గురించి ఆమె ధైర్యసహసాల గురించి నాడు కెసిఆర్ ఎన్నో విషయాలను చెప్పారని కానీ ఆయన పాలనలో 10 సంవ త్సరాల కాలంలో బోధన్ పట్టణంలో చాకలి ఐలమ్మ స్మారక స్థూపాన్ని ఏర్పాటు చేయ లేదని కనీసం ఇప్పుడైనా ప్రజా పాలన లో కాంగ్రెస్ పార్టీ తరఫున చాకలి ఐలమ్మ స్వారక స్తూపాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

చాకలి ఐలమ్మ విగ్రహ స్మారక స్తూపానికి స్థలాన్ని ఇవ్వటానికి బోధన్ మున్సిపాలిటీలో తీర్మానించడం జరిగిం దని,ఆ స్థలం ఎక్కడ అనే దాని గురించి తెలి య జేస్తామని అదేవిధంగా చాకలి ఐలమ్మ స్మారక స్థూపా నికి కూడా విరాళాలు సేకరించి ఇస్తామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కౌన్సిలర్ తూము శరత్ రెడ్డి హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో రజక సంఘం పట్టణ అధ్యక్షు డు మల్లెపూల శంకర్ అలాగే ఆ సంఘ నాయ కులు సీనియర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయ కులు కౌన్సిలర్ తూము శరత్ రెడ్డి,కౌన్సిలర్ దాము,నక్క లింగారెడ్డి, కౌన్సిలర్ సంగ్రామ్, కౌన్సిలర్ రవి,ఏంబెల్లీ గంగారాం, దీపక్, నవీన్,అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం నాయకులు పడాల శంకర్, టియుసిఐ ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా నాయకులు యాదగిరి గౌడ్,మోహన్, డి.నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎడపల్లి మండలంలో భక్తి శ్రద్ధలతో ఘనంగా ఎడ్ల పొలాల అమావాస్య.

## అందంగా అలంకరించిన బస్వన్నల తో ఆలయాల చుట్టూ





ఎడపల్లి,సెప్టెంబర్ 11: (ప్రజా గళం):ఎడపల్లి మండల కేంద్రంతో పాటు పోచారం,ఠాణాక లాన్,జాన్కంపేట్,అంబం(వై),మంగల్ పాడ్,కుర్నాపల్లి, తదితర గ్రామాలలో ఎడ్ల పోలాల అమావాస్య పండగ వేడుకలు కన్నుల పండువగా,భక్తిశ్రద్ధలతో నిర్వహించా రు.ఈ సందర్భంగా రైతులు,గ్రామస్తులు సంప్రదాయ పద్ధతుల్లో పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులు,గ్రామస్తులు సంప్రదాయ పద్ధతుల్లో పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎడపల్లి,కుర్నాపల్లి, మంగల్ పాడ్,జాన్కంపేట,ఠాణాకలాన్,తదితర గ్రామా లలో ఎడ్ల పొలాల అమావాస్య పండగను నియామని ష్టాలతో భక్తితో పండగను నిర్వహించారు.ఈ పండగ వేడుకల్లో సర్పంచ్ లు కందగట్ల రాంచందర్, పరిగె సాయిలు,చేపూర్ వీణ శ్రీనివాస్ గౌడ్, సుంచనకోట అనురాధ కిషన్ గౌడ్,గెంటే అలేఖ్య శ్రీనివాస్ యాదవ్, నీరడి జ్యోతి రవికుమార్,గ్రామ ఉపసర్పంచ్ లు,ఎడప ల్లి విడిసి అధ్యక్షులు పోలా మల్కారెడ్డి,పోచారం విడిసి అధ్యక్షులు బాజన్నోళ్ల గంగారాం, కోశాధి కారికారి కోశా ధికారి లక్ష్మీనారాయణ,వీడీసీ సభ్యులు కట్ట సుధాకర్, చిన్న లక్ష్మయ్య,కట్ట నడిపి,వార్డు నంబర్ గైని సుధాకర్ గ్రామ పెద్దలు,గ్రామ రైతులు, గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

# ఎడపల్లిలో దంచి కొట్టిన వాన

ఎడపల్లి,సెప్టెంబర్ 11: (ప్రజా గళం): ఎడపల్లిలో శుక్రవారం మధ్యా హ్నం వర్షం కురిసింది.గురువా రం మధ్యాహ్నం కూడా భారీ వర్షం కురిసింది.దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.ఒక్క సారిగా ఆకాశం మేఘావృతమై వర్షం పడింది.వరి పంట కీలక దశలో ఉన్న తరుణంలో సాగునీరు అందక ఇబ్బంది పడుతున్న రైతులకు వర్షం ఎంతో దోహదపడుతుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.ఎల్ నినో ప్రభావంతో వర్షాలు లేక ఉక్కపోత వాతావరణం నెలకొంది.

# ముచ్చటగా మూడు రోజులు అసెంబ్లీకి కేసీఆర్.



24 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం.

టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఇందిర శోభన్.

బీఆర్ఎస్ పార్టీ కి రాష్ట్రంలో పుట్టగతులు ఉండవు.

నిజామాబాద్ సిటీ సెప్టెంబర్ 11 (ప్రజాగళం ) కేసీఆర్ ముచ్చటగా మూడు రోజులు అసెంబ్లీకి వచ్చి, 24 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేశారనీ టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఇందిర శోభన్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ కి రాష్ట్రంలో పుట్టగతులు ఉండవని జిల్లా అధ్యక్షులు కాట్ పల్లి నగేష్ రెడ్డి అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు కాట్ పల్లి నగేష్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఇందిర శోభన్ విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధికార ప్రతినిధి ఇందిర శోభన్ మాట్లాడుతూ.. ప్రతి పక్ష నాయకుడిగా కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా ప్రజాధనం వృధా చేస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు దాదాపు 24కోట్లు ఖర్చు చేసారని, కేవలం వెయ్యి రోజుల్లో 3రోజులు మాత్రమే అసెంబ్లీకి వచ్చినటువంటి ప్రతిపక్ష నాయకుడు ఉండటం మనకు సిగ్గుచేటన్నారు. బి ఆర్ ఎస్ అధికారంలోకి రాకముందు రాష్ట్ర ఆర్థిక స్థితి బాగుండేదని కెసిఆర్ వచ్చాక రాష్ట్రమును అప్పుల తెలంగాణగా మార్చారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పులను చెల్లిస్తూ , సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తుందని ఇవి ప్రతి పక్ష నాయకులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు? తెలంగాణలో ఉన్న ప్రతి గ్రామంలో ఉన్న ప్రజలకు కెసిఆర్ గురించి బి ఆర్ ఎస్ గురించి తెలిసేలా కాంగ్రెస్ నాయకులు వివరించాలన్నారు. వెయ్యి రోజుల పాలనను అసెంబ్లీలో చర్చిస్తారనే ఉద్దేశ్యంతో కేటీఆర్, హరీష్ రావ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీ ముందు ఇష్టం వచ్చినట్లు వ్యవహరించరన్నారు.

స్పీకర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసారని, మహిళా పోలీసుల ముందు చొక్కాలు విప్పి నీచంగా ప్రవర్తించినటువంటి వారిని తెలంగాణ సమాజం క్షమించదన్నారు. సబిత, సునీత లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మి లను అడ్డం పెట్టుకొని బి ఆర్ ఎస్ డ్రామాలు చేస్తుం దని, వీళ్ళు ఒక్కపుడు కాంగ్రెస్ పార్టీలో అధికారం అనుభ వించి ఆ పార్టీ లోకి వెళ్లారని, ఇప్పటికయినా వీళ్ళు ఆ పార్టీ మాయలో పడి తెలంగాణ ప్రజలకు మోసం చేయకుండా ఉండాలన్నారు. బీజేపీ ప్రభుత్వం కూడా దళితుల పట్ల కపట ప్రేమ చూపుతుందని, బీజేపీ , బి ఆర్ ఎస్ రెండు ఒకే ధోరణిలో వెళ్తున్నాయని, రోబోయే రోజుల్లో ఆ పార్టీ లకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతా రన్నారు. ఈ సందర్భంగా నగేష్ రెడ్డి మాట్లాడుతూ ..మా ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు పూర్తి అయ్యి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టామన్నారు.

కాంగ్రెస్ పార్టీ చేసిన వాగ్దానాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తుచా తప్పకుండ అమలు చేస్తున్నారన్నారు. మరి ఫార్మ్ హౌస్ లో పడుకున్న కెసిఆర్ మా పార్టీ మీద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీద వ్యతిరేకంగా నినాదాలు, ధర్నాలు చేయండి అని పిలుపునివ్వడం హాస్యస్పదంగా ఉందన్నారు. అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్న సమయంలో కెసిఆర్ సూచనల మేరకు ఒక పక్కన అల్లుడు, మరో పక్క కుమారుడు వారి ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు కలిసి స్పీకర్ పైన అనుచిత వ్యాఖ్యలు చేయడం, మహిళల ముందు చొక్కాలు విప్పుకొని అసభ్యకరంగా ప్రవర్తించినందుకు ఎమ్మెల్సీలు నవీన్ రెడ్డి, తాతా మధు లను సస్పెండ్ చేయడం జరిగిందన్నారు..స్పీకర్ ను అవమానించినందుకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించడం జరిగిందన్నారు..కెసిఆర్ నిద్రలేపెందుకు మా నాయకులు నర్సారెడ్డి వెయ్యి డప్పులతో నిరసన కార్యక్రమం ఏర్పాటు చేస్తే ఆ ప్రదేశంను పసుపు నీళ్లతో శుభ్రం చేయడం దొరల అహంకారన్నీ తెలియజేస్తుందన్నారు. రాబోయే రోజుల్లో బి ఆర్ ఎస్ పార్టీ కి రాష్ట్రంలో పుట్టగతులు ఉండవని ఈ సందర్బంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు శరత్, రత్నాకర్ గౌడ్, గాదారి గోపి, జిల్లా ప్రధాన కార్యదర్శులు ప్రవీణ్ గౌడ్, బున్నే రవిందర్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు యాదగిరి, సేవాదళ్ అధ్యక్షులు సంతోష్, ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగం, ఫిషిరీస్ చైర్మన్ శ్రీనివాస్, జిల్లా కోశాధికారి భక్త వత్సలం, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు రేవతి, పోల ఉషా, స్వప్న, మాజీ ఫ్లోర్ లీడర్ రాజేంద్ర ప్రసాద్, రఘు, సాయికుమార్, గణేష్, సుభాష్, రవి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 5 రోజుల బ్యాంకింగ్ విధానాన్ని వెంటనే అమలు చేయాలి.

-యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ డిమాండ్.

-ధర్నా చౌక్ లో బ్యాంకు ఉద్యోగుల భారీ సమ్మె.




నిజామాబాద్, సెప్టెంబర్ 11( ప్రజాగళం ప్రతినిధి ) 5 రోజుల పని విధానాన్ని తక్షణమే అమలు చేయాలని ప్రధాన డిమాండ్‌తో బ్యాంకు ఉద్యోగులు ఒకరోజు సమ్మె బాట పట్టారు. సెంట్రల్ కమిటీ పిలుపు మేరకు బ్యాంకు ఉద్యోగులు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్ లో భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ, బ్యాంకు ఉద్యోగులు, అధికారులు గత 11 సంవత్సరాలనుండి ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ( యు ఎఫ్ బి యు) ఇచ్చిన దేశవ్యాప్త సమ్మె పిలుపుకు నిజామాబాద్ జిల్లాలో భారీ స్పందన లభించింది. శుక్రవారం నిర్వహించిన ఒకరోజు సమ్మెలో నిజామాబాద్ జిల్లాలోని వివిధ బ్యాంకులకు చెందిన సుమారు 1000 మంది ఉద్యోగులు, అధికారులు పాల్గొని సమ్మెను విజయవంతం చేశారు. 5 రోజుల పని విధానాన్ని ఇక ఆలస్యం చేయవద్దని కోరారు. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, ఆర్బిఐ ,నాబార్డ్ , సెబీ , ఎల్ ఐ సి వంటి సంస్థలకు ఇప్పటికే 5 రోజుల పని విధానం అమలులో ఉందని,బ్యాంకులకి కూడా ఇప్పటికే సానుకూల పరిణామాలు చోటుచేసుకున్నప్పటికీ, అమలులో జరుగుతున్న జాప్యాన్ని ఉద్యోగ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయన్నారు. బ్యాంకు ఉద్యోగులు పని వేళలు ముగిసిన తర్వాత కూడా పెండింగ్ పనులను పూర్తి చేస్తున్నారన్నారు . సెలవు రోజుల్లో సైతం విధులు నిర్వహించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. సాంకేతికత పెరిగినా పని భారం మాత్రం తగ్గలేదు. ఉద్యోగుల పని--జీవిత సమతుల్యత కోసం 5 రోజుల పని దినాలను వెంటనే అమలు చేయాలి” అని నాయకులు అన్నారు. బ్యాంకుల లాభాల్లో ఉద్యోగుల కృషి కీలకమని పేర్కొంటూ న్యాయమైన పి ఎల్ ఐ ని అందరికీ సమానంగా, పారదర్శకంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేసి ఉద్యోగులపై పెరుగుతున్న పని భారాన్ని తగ్గించాలని కోరారు. ఎన్ పి ఎస్ స్థానంలో ఒ పి ఎస్ పునరుద్ధరణ, పెన్షన్ సమస్యల పరిష్కారం, రిటైర్డ్ ఉద్యోగుల వైద్య బీమా భారాన్ని తగ్గించడం తదితర సమస్యలను కూడా పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. “ప్రజలకు అసౌకర్యం కలిగించడం మా ఉద్దేశం కాదని ఈ సందర్భంగా పేర్కొన్నారు. సమ్మె కారణంగా ఖాతాదారులకు కొంత అసౌకర్యం కలిగినందుకు చింతిస్తున్నామని, అయితే ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న న్యాయమైన సమస్యలను ప్రభుత్వం, ఐ బి ఎ దృష్టికి తీసుకెళ్లేందుకు తప్పనిసరి పరిస్థితుల్లోనే సమ్మెకు పిలుపునిచ్చామని నాయకులు వెల్లడించారు. 5 రోజుల పని దినాలు,తగినంత సిబ్బంది, గ్రాట్యుటీ పెంపు,ఎన్ పి ఎస్ లో అదనంగా జమ చేసే 4శాతం చందాపై ఆదాయపు పన్ను మినహాయింపు, పెన్షన్ అప్డేషన్ వంటి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం, ఐ బి ఎ సానుకూలంగా పరిగణించి వెంటనే పరిష్కరించాలన్నారు. లేనియెడల ఇదివరకే ప్రకటించిన విధంగా నెల చివరన జరిగే 3రోజుల సమ్మెకు, అక్టోబర్ లో నిరవధిక సమ్మెకు కూడా వెనకాడబోమని హెచ్చరించారు. సమ్మెను విజయవంతం చేసిన బ్యాంకు ఉద్యోగులకు , అధికారులకు , ఈ సమ్మెకు సంఘీభావం తెలిపిన ఇతర ట్రేడ్ యూనియన్లకు యు ఎఫ్ బి యు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమ్మెలో యు ఎఫ్ బి యు నిజామాబాద్ యూనిట్ కన్వీనర్ ఎం. వి. రమేష్, గురునాథ్,రాజు, మనోజ్ సింగ్ , వంశీ, మీసాల సందీప్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద స్థలాన్ని పరిశీలించిన పోలీస్ కమిషనర్

గురువారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో హైదరాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న ( TG 18 A 6033 ) నంబర్ గల హ్యుందాయ్ వెన్యూ కారు నాగపూర్ గేట్ సమీపంలో ప్రమాదానికి గురైంది. డిచిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగపూర్ గేట్ వద్ద నిజామాబాద్ రోడ్డు దాటిన అనంతరం , లారీ / ట్యాంకర్ ( ూ09ఖదీ9042 ) గల డ్రైవర్ ఎలాంటి ముందస్తు సూచనలు , హెచ్చరికలు లేకుండా రహదారిపై వాహనాన్ని అజాగ్రత్తగా నిలిపివేసినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఈ క్రమంలో వెనుక నుంచి వస్తున్న హ్యుందాయ్ వెన్యూ కారు రోడ్డుపై నిలిపి ఉన్న వాహనాన్ని ఢీకొన్నట్లు సమాచారం. ఈ ప్రమాదంలో కారులో పక్క సీటులో ప్రయాణిస్తున్న పైడిపల్లి భోజన్న (49), మన్మాడ్ గ్రామం , లోకేశ్వరం మండలం, నిర్మల్ జిల్లా సంఘటన స్థలంలోనే మృతి చెందారు. కారు డ్రైవర్ గురువెల్లి గంగాధర్ తో పాటు వెనుక సీటులో ప్రయాణిస్తున్న మనోజ్ కు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసు అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలు , రహదారిపై వాహనం నిలిపిన విధానం, ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను పరిశీలించారు.